# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 290
పేజీలు : 08 | వెల: రూ.5/-
గురువారం
ఆగస్టు 28, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




8లో..

## నిమజ్జనాన్ని పక్కాగా నిర్వహించాలి

- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్
- గ్రేటర్ కమిషనర్ తో కలిసి క్షేత్ర స్థాయి పరిశీలన




8లో..

## అభివృద్ధి చేయడం చేతకాక..
## కేంద్ర మంత్రిపై నిందలు

- అవగాహన లేక 'నాయిని' వ్యక్తిగత విమర్శలు
- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్



8లో..

## విద్యారంగ అభివృద్ధికి చర్యలు

- ఎంపీ కావ్య, ఎమ్మెల్యే నాగరాజు
- మైనారిటీ స్కూల్ లో ఆకస్మిక తనిఖీలు



2లో..

## తక్షణమే యూరియా పంపిణీ చేయండి

- అధికారులను కోరిన ఎర్రబెల్లి దయాకర్ రావు
- రైతుల బాధలు తెలుసుకున్న మాజీ మంత్రి



# ఆగిపోవే.. వానమ్మ
## తల్లడిల్లె నేలమ్మ

వివరాలు 2లో..

- అల్పపీడనంతో అతలాకుతలం
- రెండు రోజులుగా భారీ వర్షాలు
- నీట మునిగిన పల్లపు ప్రాంతాలు
- చెరువులను తలపిస్తున్న గ్రామాలు
- ముమ్మరంగా సహాయక కార్యక్రమాలు

అల్పపీడనం అతలాకుతలం చేసే. ఊరే వరదల్ల మునిగిపోయే. ఉన్నొక్క గూడు చెదిరిపోయే. గొడ్డు గోదా ఊపిరి ఆగిపోయే. చేను, చెలకా చెదిరిపోయే. ఎడతెరిపి లేకుండా కురిసే వానకు తావు లేక తల్లీ పిల్లలు తల్లడిల్లే. గత రెండు రోజులుగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు జన జీవనం అతలాకుతలం అయింది. పంట చేల నుంచి మొదలుకొని పరిశ్రమల వరకు పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. కండ్ల ముందే కంటికి రెప్పలా కాపాడుకున్న పంట, కట్టుకున్న ఇల్లు నీటిలో కొట్టుకుపోతుంటే ఏమీ చేయలేని దయనీయ పరిస్థితి నెలకొంది. అయితే అనావృష్టి లేకుంటే అతివృష్టి అనే విధంగా దంచి కొడుతున్న వర్షాల నేపథ్యంలో కర్షక, కార్మిక, కార్పొరేట్ వ్యవస్థలు సైతం అల్లాడిపోతున్నాయి. పల్లపు ప్రాంతాలు ముంపునకు గురికాగా, పలు గ్రామాలు చెరువులను తలపిస్తున్నాయి. అప్రమత్తమైన అధికారులు అత్యవసర పరిస్థితిలో తప్ప ఇంటి నుంచి బయటకు రావద్దంటూ హెచ్చరికలు జారీ చేశారు. అయితే ఇకనైనా వరుణుడు కనికరించాలని, వాతావరణ పరిస్థితులు అనుకూలించాలని, సబ్బండ వర్గాలు సంతోషంగా ఉండే విధంగా పరిస్థితుల్లో మార్పు రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. అగిపోవే వానమ్మ.. తల్లడిల్లె నేలమ్మ అంటూ వాణ దేవుడి శరను కోరుతున్నారు. - వరంగల్ వాయిస్, దామెర



# అగిపోవే వానమ్మ.. తల్లడిల్లె నేలమ్మ..

- అల్పపీడనంతో అతలాకుతలం
- రెండు రోజులుగా భారీ వర్షాలు
- నీట మునిగిన పల్లపు ప్రాంతాలు
- చెరువులను తలపిస్తున్న గ్రామాలు
- ముమ్మరంగా సహాయక కార్యక్రమాలు



**వరంగల్ వాయిస్, దామెర :** అల్పపీడనం అతలాకుతలం చేసింది. భారీ వర్షాలకు ఉమ్మడి వరంగల్ జిల్లా అతలాకుతలమైంది. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లు నీట మునిగి రవాణాకు అంతరాయం ఏర్పడింది. ఎగువ నుంచి వస్తున్న వరదలతో చెరువులు, కుంటలు మత్తడి దుముకుతున్నాయి. భారీ వర్షాల కారణంగా సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ హెచ్చరికలతో అధికారులు అప్రమత్తమయ్యారు. అత్యవసర పనులు ఉంటే తప్ప ఇంటినుంచి బయటకు రాకూడదంటూ హెచ్చరిస్తున్నారు.

### ములుగు జిల్లాలో ఆగమాగం..

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తమైంది. ములుగు జిల్లా చిగురుటాకుల్లా వణికిపోయింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఆగమాగమైంది. వెంకటాపురం, గోవిందరావుపేట, తాడ్వాయి మండలాల్లో జనజీవనం స్తంభించిపోయింది. తాడ్వాయి మండలం కాల్వపల్లి సమీపంలోని వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. గుండ్లవాగు ప్రాజెక్టు నిండుకుండలా మారి మత్తడిపోస్తోంది. జంపన్నవాగు ఉద్ధృతికి మేడారంతోపాటు పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. లక్నవరం సరస్సు నిండు కుండను తలపిస్తోంది. బుస్సాపూర్ సమీపంలోని లక్నవరం సరస్సులో 34 అడుగుల మేర నీరు చేరింది. దీంతో లక్నవరం సరస్సుకు పర్యాటకులను అనుమతించడంలేదు. అధికారులు ప్రమాద హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

### భూపాలపల్లిలో డేంజర్ బెల్స్..

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహాముత్తారం మండలంలో కురిసిన భారీ వర్షానికి పలు గ్రామాలు నీటిలో మునిగాయి. గ్రామాల్లో చెరువులు, కుంటలు నిండుకుండల్లా మారాయి. వాగులు, వంకల్లోకి భారీగా వరదనీరు చేరడంతో ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. కోనంపేట వాగు కేశవపూర్–నిమ్మగూడెం మధ్య కాజ్‌వేపై నుంచి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పెద్దవాగు ఉధృతితో మేడారం వైపుగా వెళ్లే వాహనాలు గంటలతరబడి నిలిచిపోయాయి. ప్రజలు వాగులు దాటకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి తగుచర్యలు చేపట్టారు. పోచంపల్లిలో పిడుగుపాటుకు ఓ రైతుకు చెందిన ఎద్దు మృతి చెందింది. భూపాలపల్లి డివిజన్ సింగరేణి ఓపెన్ కాస్ట్‌లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. కాకతీయ ఖని-2, 3 ఉపరితల గనుల్లో బొగ్గు ఉత్పత్తి లేకపోవడంతో బొగ్గును తరలించే వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. వర్షంతో ఉపరితల గనుల క్వారీలన్నీ బురదమయంగా మారాయి. కోల్ బెంచ్‌ల్లోకి వరద నీరు చేరడంతో బ్లాస్టింగ్ చేసే అవకాశం లేకుండా పోయింది.

### రెండు రోజులు అప్రమత్తం..

రానున్న రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ హెచ్చరికలతో అధికారుల అప్రమత్తం అయ్యారు. ప్రజలు అత్యవసమైతే తప్ప బయటకు రావొద్దని హెచ్చరికలు చేశారు. భారీ వర్షాల దృష్ట్యా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలెక్టర్లకు సూచించారు. పురాతన ఇళ్లలో ఉండేవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. దీంతో అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ముందస్తు చర్యలు చేపడుతున్నారు. వినాయక మండపాల సమీపంలోని విద్యుత్ స్తంభాల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలంటూ సూచిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లతో భక్తులకు ప్రమాదం లేకుండా చూడాలని ఆదేశించారు.



# తక్షణమే యూరియా పంపిణీ చేయండి

- అధికారులను కోరిన ఎర్రబెల్లి దయాకర్ రావు
- రైతుల బాధలు తెలుసుకున్న మాజీ మంత్రి

**వరంగల్ వాయిస్, పాలకుర్తి :** పాలకుర్తి మండలం పరిధిలో యూరియా లేక రైతులు అరిగోస పడుతున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆరోపించారు. తొర్రూరు ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం మీదుగా వాహనంలో వెలుతున్న దయాకర్ రావు అక్కడ రైతులు పడుతున్న గోసను చూసి వాహనం ఆపి రైతులతో మాట్లాడారు. వారి బాధలను తెలుసుకున్న ఎర్రబెల్లి అక్కడినుంచే వ్యవసాయ శాఖ అధికారులతో ఫోన్ లో మాట్లాడారు. తక్షణమే రైతులకు సరిపడ యూరియాను అందజేయాలని కోరారు. రైతులు తెల్లవారుజామునుంచి తిండి తిప్పలు లేకుండా ఎరువుల కోసం ఎదురు చూస్తే ఒక్కో రైతుకు ఒక్క బస్తాను మాత్రమే ఇచ్చి వారిని మభ్యపెడుతున్నారని ఆరోపించారు. ప్రజాపాలన అని చెప్పుకుంటున్న ఈ ప్రభుత్వం ప్రజలను రాక్షసులుగా వేదిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో రారాజులుగా బతికిన రైతులు ఈ దుర్మార్గపు పాలనలో ఎరువులకోసం రైతులు అధికారుల కాళ్లు పట్టుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఒకప్పుడు తెలంగాణలో రైతు రాజ్యంగా ఒక వెలుగు వెలగగా నేడు రాక్షస రాజ్యం నడుస్తోందన్నారు. ఎరువుల సరఫరాలో అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం ఫెయిల్ అయిందని ఆరోపించారు. కేసీఆర్ ఆరు నెలల ముందే ఎరువులను నిలువ చేసి రైతులకు కొరత లేకుండా చూస్తే, ఈ ప్రభుత్వానికి ముందు చూపులేని కారణంగా రైతులను ఆగం చేస్తున్నారని మండిపడ్డారు.



# మృతుడి కుటుంబానికి పరామర్శ

**వరంగల్ వాయిస్, జమ్మికుంట :** జమ్మికుంట పట్టణానికి చెందిన చిదురాల శంకరయ్య ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కరీంనగర్ జిల్లా సగర సంఘం జిల్లా అధ్యక్షుడు దేవునూరి శ్రీనివాసు సగర, జిల్లా ప్రధాన కార్యదర్శి కట్టరాజు సగర, జిల్లా కోశాధికారి కాటిపెల్లి కుమారస్వామి సగర తదితర నాయకులు గురువారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి చిత్రపటం వద్ద పూలు జల్లి నివాళులర్పించారు. ఆయన మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట సగర సంఘం నాయకులు కుర్మిండ్ల అశోక్‌కుమార్, చిదురాల రాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఇది ఒక ప్లేస్ మెంట్ కేంద్రం

- కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం
- మహిళ ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ సమావేశం

**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీలోని మహిళ ఇంజినీరింగ్ కళాశాల ఒక ప్లేస్ మెంట్ కేంద్రమని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం అన్నారు. కాకతీయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఉమెన్స్ ప్రథమ సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థులకు గురువారం విశ్వవిద్యాలయం సెనెట్ హాల్లో కళాశాల ప్రిన్సిపాల్ కె.బిక్షాలు అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం కళాశాలలో ప్రవేశం పొందిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు విశ్వవిద్యాలయంలోని వసతులు, అధ్యాపకుల గురించి వివరించారు. నాణ్యమైన విద్యను అందించడంలో మహిళా ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపక బృందం ముందంజలో ఉందన్నారు. విశ్వవిద్యాలయంలో ఎలాంటి ర్యాగింగ్ ఉండదని, విద్యార్థినులకు మహిళ సెక్యూరిటీ ద్వారా భద్రత కల్పిస్తున్నామని వెల్లడించారు. ఎన్ఐటీ నుంచి అతిథిగా విచ్చేసిన ప్రొఫెసర్ ఎమ్.సైలేజ కుమారి మాట్లాడుతూ విద్యార్థులు ఏదైనా సాధించాలి అంటే పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. ప్రిన్సిపాల్ కె.బిక్షాలు మాట్లాడుతూ మహిళ ఇంజినీరింగ్ కళాశాల 2013లో స్థాపించినప్పటినుంచి నేటి వరకు క్రమక్రమేన మెరుగు పడుతున్నదన్నారు. ఉదయం సాయంత్రం రిజిస్టర్ కళాశాలను పర్యవేక్షిస్తారని విద్యార్థులకు అనుకూలమైన వసతులు కల్పించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వాణిశ్రీ, వీణ తదితరులు పాల్గొన్నారు.







# నియోజకవర్గంలో కనీవినీ ఎరగని రీతిలో అభివృద్ధి

◆ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ గురువారం 58 వ డివిజన్ పరిధిలోని స్నేహ నగర్ లో అంతర్గత రోడ్ల నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నగరంలో అత్యవసర ప్రాంతాలకు గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలు,నివారణ చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే నాయిని పేర్కొన్నారు. ఏబీసీలుగా పనులను గుర్తించి ఒక్కటిగా చేస్తున్నామని తెలిపారు. వర్షాలలో సైతం నగరంలో ఒకటి రెండు ప్రాంతాలలో తప్ప ఎటువంటి ఇబ్బందులు లేవని ప్రతి కార్యక్రమంలో ప్రజల సహకారం వలనే సాధ్యమైందని అన్నారు. నిన్నటి నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే నాయిని ఆదేశించారు.ఈ మేరకు 57 వ డివిజన్ గోకుల్ నగర్ ప్రాంతంలో నగర కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలసి ప్రాంతాలను పరిశీలించారు. వరద ప్రవాహానికి అడ్డుగా ఉండే ప్రాంతాలకు గుర్తించి పరిష్కార మార్గాలను చూడాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ ప్రజా ప్రతినిధులు,పార్టీ నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## క్యారం బోర్డులను పంపిణీ చేసిన నాయిని

జిల్లా సోషల్ మీడియా ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వినాయక మండపాలకు (డివిజన్ కి రెండు చొప్పున)క్యారం బోర్డ్ లను వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి అందజేశారు. సామాజిక మాధ్యమాల్లో ప్రభుత్వ పథకాలు ప్రచారం చేస్తూ ప్రజలకు విషయ పరిజ్ఞానంలో చేరువచేస్తూ,సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టడం చాలా సంతోషం అని ఎమ్మెల్యే నాయిని అభినందించారు. వినాయక మండపాల్లో భక్తిభావంతో పాటు,అడవిడుపు కోసం ఈ కార్యక్రమం దోహదపడుతుందని అన్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో ఎటువంటి ఆటంకాలు తలెత్తకుండా చూడాలని, విద్యుత్తు పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు,సోషల్ మీడియా ప్రతినిధులు, కార్యకర్తలు, భక్తులు, యువకులు పాల్గొన్నారు.


# అతి భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్



**వరంగల్ వాయిస్, హుస్నాబాద్:** రాష్ట్రంలో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు వొడితెల సతీష్ కుమార్ సూచించారు. మరో రెండు మూడు రోజుల పాటు వర్షాలు కొనసాగే అవకాశం ఉన్నందున ప్రజలు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. పాత, శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసించేవారు వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలి. గోడలు, పైకప్పులు కూలిపోయే ప్రమాదం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. నదులు, వాగులు ఉప్పొంగుతున్నందున లోతట్టు ప్రాంతాలకు, వాగుల దగ్గరకు వెళ్లకూడదు. కల్వర్టులు, వంతెనల మీదుగా నీరు ప్రవహిస్తుంటే వాటిని దాటే ప్రయత్నం చేయవద్దు. ప్రయాణాలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దు. ప్రయాణాలను వాయిదా వేసుకోవడం మంచిది.

పొలాల్లోని విద్యుత్ మోటార్ల వద్ద రైతులు జాగ్రత్తగా ఉండాలి. విద్యుత్ స్తంభాలను, వైర్లను తడి చేతులతో తాకరాదు. నీరు నిలిచి ఉన్న విద్యుత్ స్తంభాల దగ్గర నుంచి వెళ్లవద్దు. విద్యుత్ షాక్‌లు తగిలే ప్రమాదం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సతీష్ కుమార్ అన్నారు. వర్షాలు పూర్తిగా తగ్గే వరకు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే అధికారులకు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.




# గణపురం రూపురేఖలు మారుస్తా

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**వరంగల్ వాయిస్, గణపురం :** గణపురం రూపురేఖలు మారుస్తా అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో గురువారం 31 మంది కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు రూ. 31 లక్షలు విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణపురంలోని కాకతీయుల కోట గుళ్లు, ఘనప సముద్రం లను, టూరిజం కేంద్రాలుగా అభివృద్ధి పరచనున్నట్లుగా పేర్కొన్నారు. వీటితోపాటు నాలుగు లైన్లతో గణపురం మెయిన్ రోడ్డును విస్తరింపజేయనున్నట్లు, అలాగే సెంట్రల్ లైటింగ్ తదితర పనులను ఏడాదిలోగా పూర్తి చేయిస్తానని అన్నారు. రానున్న రోజుల్లో గణపురంలో 400 మంది పేదలకు ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తామని హామీ ఇచ్చారు. తమ రేవంత్ సర్కారు మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వడ్డీ లేని రుణాలు అందిస్తుందని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు మోకాళ్లు అడ్డుతున్నాయని విమర్శించారు. ప్రతి విషయంపై దుష్ప్రచారం చేస్తూ బురద చల్లుతున్నాయని దుయ్యబట్టారు. యూరియా కొరత కేంద్రంలోని బీజేపీ ప సర్కార్ దేనని ఆరోపించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ అభ్యర్థులను గెలిపించి తనను మరింత శక్తివంతం చేయాలని నియోజకవర్గ ప్రజలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.సత్యనారాయణ స్వామి, ఎంపీడీవో ఎల్.భాస్కర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆర్.రాజేందర్, పార్టీ నేతలు వి.నారాయణ గౌడ్, ఎం.శివశంకర్ గౌడ్, వి.అశోక్, ఎండీ చోటే మియా, ఓ కృష్ణ, కే.శ్రీను, డి.దుర్గయ్య, ఎం.రాజయ్య, సొసైటీ చైర్మన్లు కుమార్ యాదవ్, సత్తిరెడ్డి పాల్గొన్నారు.

# విద్యుత్ ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి

**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్:** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేస్తోందని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి గంగుల దయాకర్ విమర్శించారు. నేడు, 25 సంవత్సరాల క్రితం విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో అమరులైన ముగ్గురు వీరులకు ఖిలా వరంగల్ పడమరకోట, తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. న్యూ డెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దయాకర్ మాట్లాడుతూ, గతంలో విద్యుత్ రంగం రాష్ట్రాల జాబితాలో ఉండేదని, అయితే మోడీ ప్రభుత్వం 2023 చట్టం ద్వారా దానిని తన ఆధీనంలోకి తీసుకుని, బడా పెట్టుబడిదారులైన అంబానీ, అదానీలకు అప్పగిస్తోందని ఆరోపించారు. ప్రస్తుతం చంద్రబాబు, మోడీ కలిసి దేశంలోని కార్పొరేట్లకు, బహుళజాతి సంస్థలకు,



సామ్రాజ్యవాద దేశాలకు తొత్తులుగా మారి ప్రభుత్వ రంగాలను ప్రైవేటీకరణ చేస్తున్నారని దయాకర్ విమర్శించారు. రాబోయే రోజుల్లో మోడీ ప్రభుత్వం చేపడుతున్న విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడటమే ఆ అమరవీరులకు మనం అందించే ఘనమైన నివాళి అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గద్దల ప్రభాకర్, ఇనుముల కృష్ణ, అయిత యాకయ్య, బండి చంద్రమౌళి, ఎండి అక్బర్, రాజు దేవయ్య పాల్గొన్నారు.

# దాసు రఘురాంకు ఘన నివాళి

**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి:** దివంగత దాసు సురేశ్ తండ్రి దాసు రఘురాం చిత్రపటానికి హసన్‌పర్తిలోని వారి నివాసం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా దాసు రఘురాము చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేదునూరి రాజమౌళి మాట్లాడుతూ పోలీస్ శాఖలో కానిస్టేబుల్‌గా చేరి సబ్–ఇన్‌స్పెక్టర్‌గా పదవీ విరమణ పొందే వరకు 36 సంవత్సరాల పాటు నీతి, నిజాయితీ, అంకితభావంతో పనిచేసిన రఘురాం నేటి సమాజానికి ఆదర్శప్రాయుడని కొనియాడారు. రఘురాం కుమారుడు దాసు సురేశ్ బీసీ రాజ్యాధికార సమితిని స్థాపించి, రాష్ట్ర అధ్యక్షుడిగా బీసీ సమాజం సంఘటితమై స్వయం పాలన కోసం ఉద్యమించాలని ముందుకు సాగడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోనగాని యాదగిరి గౌడ్, బీసీ రాజ్యాధికార సమితి నాయకులు గంటి వీరేందర్ గౌడ్, రవి యాదవ్, ఆర్టీసీ మంథని డిపో మేనేజర్, వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, సోమిశెట్టి హర్షవర్ధన్ రావు, భారత్ బచావో నాయకులు ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర కమిటీ సభ్యుడు, వరంగల్ జిల్లా కన్వీనర్ వంగ రవి యాదవ్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు గండి వీరేందర్





గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఏరుకొండ హైమావతి, వరంగల్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కొక్కు అశోక్ ముదిరాజ్, జిల్లా కమిటీ సభ్యుడు సిల్వర్ రవీందర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు సట్ల ప్రభాకర్, నర్సంపేట మండల అధ్యక్షుడు సిలువేరు ద్రోణాచారి, నాగరాజు తదితరులు దాసు రఘురాం చిత్రపటానికి పూలు చల్లి ఘనంగా నివాళులు అర్పించారు.

# ఘనంగా వన మహోత్సవం

**◆ మొక్కలు నాటిన ఎమ్మెల్యే, మేయర్**



**వరంగల్ వాయిస్, మామునూరు:** మామునూరులోని పోలీస్ ట్రైనింగ్ కాలేజ్ (పీటీసీ) గేటు వరకు రూ. 86 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు డివైడర్ పనులకు బుధవారం శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) మేయర్ గుండు సుధారాణి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా వన మహోత్సవంలో భాగంగా పీటీసీలో మేయర్ సుధారాణి, పీటీసీ ప్రిన్సిపాల్ పూజతో కలిసి ఎమ్మెల్యే నాగరాజు మొక్కలు నాటారు. అనంతరం, పీటీసీ పరిపాలనా భవనంలో రోడ్డు పనుల కోసం నిధులు మంజూరు చేయించినందుకు ఎమ్మెల్యే నాగరాజు, మేయర్ సుధారాణి, కార్పొరేటర్‌ను పీటీసీ ప్రిన్సిపాల్, పోలీస్ అధికారులు సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, "ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ సీసీ రోడ్డు డివైడర్ నిర్మాణం చేపడుతున్నాం. ట్రాఫిక్ భద్రత పెంచడం, ప్రమాదాలను నివారించడం, ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణ మార్గాన్ని అందించడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశ్యం," అని అన్నారు. ప్రజల అభివృద్ధి కోసం, శాశ్వత సౌకర్యాల కోసం తాను నిరంతరం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. తాను గతంలో ఎస్సై నుంచి సీపీ వరకు పోలీస్ అధికారిగా పనిచేసిన అనుభవాన్ని గుర్తు చేసుకుంటూ, పీటీసీకి ఉన్న అవినాభావ సంబంధాన్ని తెలిపారు. పోలీస్ కష్టనష్టాలు తనకు తెలుసని, అందుకే పీటీసీ ప్రిన్సిపాల్ పూజ సూచన మేరకు వాటర్ ట్యాంక్, ఓపెన్ జిమ్, అంతర్గత రోడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. "ప్రతి ఒక్కరూ తమ వాతావరణాన్ని కాపాడుకోవాలంటే మొక్కలు నాటడం తప్పనిసరి. ప్రకృతిని ప్రేమించాలంటే పచ్చదనాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉంది," అని నాగరాజు అన్నారు. పరిసరాలను పచ్చగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటి, దాన్ని సంరక్షించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీటీసీ ప్రిన్సిపాల్ పూజ, స్థానిక కార్పొరేటర్ ఈదురు అరుణ, స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీస్ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, అడిషనల్ డీసీపీ ఆర్. ప్రభాకర్ రావు, ఏసీపీ టి. సత్యనారాయణ పర్యవేక్షణలో వరంగల్ ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 14 మందిని మేజిస్ట్రేట్ అబ్బోజు వేంకటేశం ఎదుట హాజరుపరిచారు. విచారణ అనంతరం బుర్రి బాబు, పందెం సతీష్, దుపాకి ప్రణయ్ లకు రెండు రోజుల జైలు శిక్ష విధించారు. వీరిని హుజూరాబాద్ సబ్ జైలుకు పంపారు. మిగిలిన 11 మందికి మొత్తం రూ. 15,400 జరిమానా విధించారు.అదే విధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న నలుగురు వ్యక్తులను కోర్టులో హాజరుపరచగా, వారికి రూ. 2,000 చొప్పున జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె. సుజాత తెలిపారు. ఈ చర్యలు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించేవారికి ఒక హెచ్చరికగా నిలుస్తాయని ఆమె అన్నారు.

## కాశీబుగ్గలో ఘనంగా గణపతి ఉత్సవాలు



**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** వరంగల్ కాశీబుగ్గ వర్తక సంఘం ఆధ్వర్యంలో గణపతి నవరాత్రులు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది ఉత్సవాల కోసం ఏకాదశ శేష గణపతి విగ్రహాన్ని గోరంటల మనోహర్ విరాళంగా అందించారు. వర్తక సంఘం అధ్యక్షులు గుండేటి కృష్ణమూర్తి-విజయలక్ష్మి దంపతులు మొదటి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కృష్ణమూర్తి మాట్లాడుతూ నవరాత్రుల సందర్భంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం పూజ అనంతరం ప్రసాద వితరణ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల శ్రీరాములు, గుల్లపల్లి రాజ్ కుమార్, ఒరుగంటి కొమురయ్య, డాక్టర్ గోనే జగదీశ్వర్, మాటేటి విద్యాసాగర్, బోడకుంట్ల వైకుంఠ, కందగట్ల రాజు, గుండు సత్యనారాయణ, బండారి శ్రీనివాస్, సలిమడుగు వెంకటాచారెడ్డి, కృష్ణమూర్తి, లక్ష్మీ గణపతి సహకార పరపతి సంఘం అధ్యక్షులు వంగరి రాంప్రసాద్, దుస్సకృష్ణ, వేముల నాగరాజు, ములుక సురేష్, పసునూటి శ్రీకాంత్, మండల చందు, గాజుల రాజేష్, బండారి రాజు, లింగ బత్తుల ఆనంద్, గాదె జగన్, దాసరి సంతోష్, సింగం కృష్ణ, కోడం శరత్, దాసరి దేవేందర్, గాదె సతీష్, వంగ ఐలయ్య మరియు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## వర్షాల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

**డీసీపీ అంకిత్ కుమార్**



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ ఆదేశించారు. గురువారం ఆయన పరకాల ఏసీపీ సతీష్ బాబుతో కలిసి ఆత్మకూరు మండలంలోని కటాక్షపూర్ చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా కటాక్షపూర్ చెరువు మత్తడి పోస్తుండడంతో, వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహించాలని, వాహనదారులకు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తూ ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సీఐ సంతోష్‌ను ఆదేశించారు. ఒకవేళ పరిస్థితి ప్రమాదకరంగా మారితే, ట్రాఫిక్‌ను మళ్లించి రోడ్డు జామ్ కాకుండా చూడాలన్నారు. మండలంలోని ఇతర ప్రాంతాల్లోని చెరువులు, వాగులు, వంతెనలను సిబ్బంది నిరంతరం పరిశీలించి, జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని డీసీపీ సూచించారు. ఈ పర్యటనలో డీసీపీ అంకిత్ కుమార్ వెంట ఏసీపీ సతీష్ బాబు, సీఐ సంతోష్, ఎస్సై తిరుపతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## 31లోగా వసతులు సమకూర్చాలి

**హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్**

**స్పోర్ట్స్ స్కూల్ ప్రారంభానికి ఏర్పాట్ల పరిశీలన**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో తాత్కాలికంగా ప్రారంభించనున్న 'స్పోర్ట్స్ స్కూల్ కమ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ'కి అవసరమైన సౌకర్యాలను కలెక్టర్ స్నేహ శబరీష్ గురువారం పరిశీలించారు. ఈ మేరకు ఆమె స్టేడియం ఆవరణలో ఉన్న హాస్టల్ భవనాలు, అవుట్‌డోర్ క్రీడా మైదానాలను పరిశీలించి, మరమ్మత్తులు మరియు కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులకు క్రీడా సౌకర్యాలు ఈ నెల 31లోగా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న మౌలిక వసతుల గురించి డివైఎస్ఓ అశోక్ కుమార్‌తో చర్చించారు. హాస్టల్ వసతి, ఇండోర్, అవుట్‌డోర్ క్రీడా పరికరాల ఏర్పాటు, అవసరమైన మరమ్మత్తులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ ఈఈ సురేష్, నరేందర్ రెడ్డి, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## తక్కళ్లపల్లికి శ్రీనివాస రావుకు ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన తక్కళ్లపల్లి శ్రీనివాసరావును హనుమకొండ జిల్లా నాయకులు ఘనంగా సన్మానించారు. మేడ్చల్ జిల్లాలో ఈ నెల 20 నుంచి 22 వరకు జరిగిన సీపీఐ రాష్ట్ర నాలుగో మహాసభల్లో ఆయన తిరిగి ఈ పదవికి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గురువారం బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో తక్కళ్లపల్లిని పూలమాలలు, పూల బొకే, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కర్రె బిక్షపతి, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, నాయకులు ఎన్.ఎ. స్టాలిన్, బత్తిని సదానందం, మునిగాల బిక్షపతి, కొట్టేపాక రవి, మాలోత్ శంకర్ నాయక్, అదరి రమేష్, కామెర వెంకటరమణ, గుంటి రాజేందర్, యాళ్ళ సంజయ్, కండె నర్సయ్య, అలువాల రాజు, లకవత్ లక్ష్మి, కోడెపాక బాబు, పూజారి అమృతయ్య, మామునూరి దామోదర్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు జాగ్రత్తగా ఉండాలి

**◆ అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో**



**వరంగల్ వాయిస్, దోర్నకల్:** కురవి మండలంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో గురువారం ఆకస్మికంగా పర్యటించారు. ఈ పర్యటనలో ఆయన నల్లెల మరియు మోదుగుల గూడెం గ్రామాల్లోని చెరువులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, మరియు అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించారు. జిల్లాలో ఉన్న వర్ష సూచనల దృష్ట్యా, అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు నిత్యం చెరువులు, కాలువలు, లో-లెవెల్ వంతెనలు, కుంటలను పర్యవేక్షించాలని సూచించారు. సంబంధిత ఇరిగేషన్ సిబ్బంది చెరువులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. స్థానిక అధికారులు ప్రధాన కార్యాలయంలోనే అందుబాటులో ఉండాలని తెలిపారు. మోదుగుల గూడెం గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన లెనిన్ వత్సల్ టోప్పో, విద్యార్థులకు రుచికరమైన, వేడివేడి ఆహారాన్ని డైట్ మెనూ ప్రకారం అందించాలని అన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, షెడ్యూల్ ప్రకారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని, నూతన టెక్నాలజీ ద్వారా విద్యాబోధనలు అందించాలని సూచించారు. పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి, పిల్లలకు పౌష్టికాహారం, మధ్యాహ్నం వెజ్ బిర్యానీని మెనూ ప్రకారం అందించాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో అధికారులు వసతి గృహాలు, అంగన్వాడీ కేంద్రాలు, మరియు పాఠశాలలను నిరంతరం తనిఖీ చేయాలని ఆయన ఆదేశించారు. ఈ పర్యటనలో మండల ప్రత్యేక అధికారి ఎం.నరసింహస్వామి, తహసీల్దార్ విజయ, ఎంపీడీవో వీరబాబు, ఏఈ నరేష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

# 'బోధనా నైపుణ్యాలను మెరుగుపరుచుకోండి'

## ◆ కేయూ రిజిస్ట్రార్ వి.రామచంద్రం



**వరంగల్ వాయిస్, కేయూ :** మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అధ్యాపకులు తమ బోధనా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ) రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం అన్నారు. కేయూ కామర్స్ కళాశాల సెమినార్ హాల్లో 'డేటా డ్రివెన్ టీచింగ్, బిజినెస్ అనలిటిక్స్ అండ్ పవర్ బీఐ ఫర్ ఎడ్యుకేటర్స్' అనే అంశంపై ఏర్పాటు చేసిన మూడు రోజుల వర్క్‌షాప్ తొలిరోజు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 21వ శతాబ్దంలో డేటా కీలక పాత్ర పోషిస్తుందని, దానికి తగ్గట్టుగా బోధనా మెలకువలు నేర్చుకోవాలని ఆయన సూచించారు. డేటా డ్రివెన్ టీచింగ్ వ్యూహాత్మక ప్రణాళికలో ముఖ్య భూమిక పోషిస్తుందని చెప్పారు. యూనివర్సిటీని ఉదాహరణగా తీసుకుంటే, విద్యార్థుల హాజరు, తరగతి గదిలో వారి ప్రవర్తన వంటి అంశాలను తెలుసుకుని, అందుకు అనుగుణంగా బోధనలో మార్పులు చేసుకోవచ్చని ఆయన వివరించారు. కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.అమరావేణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో, డీన్ ఆచార్య రాజేందర్ కట్ల మాట్లాడుతూ డేటా డ్రివెన్ టీచింగ్ ప్రస్తుత అవసరమని తెలిపారు. దీని ద్వారా వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవడం సాధ్యమవుతుందని చెప్పారు. పాఠ్య ప్రణాళిక అధ్యక్షురాలు ఆచార్య పి. వరలక్ష్మి మాట్లాడుతూ కోర్సు నిర్మాణం, పరీక్షల ప్రణాళిక, మార్కుల విభజన గురించి వివరించారు. ఈ అంశంపై వర్క్‌షాప్ నిర్వహించడం అభినందనీయమని పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. నరసింహ చారి అన్నారు. వర్క్‌షాప్ అధ్యక్షులు ఆచార్య అమరావేణి మాట్లాడుతూ, మూడు రోజుల పాటు వివిధ అంశాలపై నిపుణులచే వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నామని, కేయూ పరిధిలోని వివిధ కళాశాలల నుంచి 40 మంది ఎంబీఏ అధ్యాపకులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఫణీంద్ర కుమార్, డాక్టర్ ప్రగతి, ఇతర కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

### కేయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఉత్తమ విద్యా సంస్థ..

తెలంగాణలోనే మహిళలకు ఉత్తమ ఇంజనీరింగ్ విద్యను అందిస్తున్న కళాశాల కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ) మహిళా ఇంజనీరింగ్ కళాశాల అని కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం అన్నారు. ఈ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలు పొందిన విద్యార్థినులకు, వారి తల్లిదండ్రులకు నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఈ కళాశాల కేవలం చదువుకే కాకుండా ఇతర అంశాలపై కూడా శ్రద్ధ వహిస్తుందని తెలిపారు. మంచి ప్లేస్‌మెంట్ ట్రాక్ రికార్డు ఉన్న కళాశాల ఇది అని ఆయన పేర్కొన్నారు. కేయూ పూర్తిగా ర్యాగింగ్, డ్రగ్స్ రహిత విశ్వవిద్యాలయం అని, తల్లిదండ్రులు పూర్తి నమ్మకంతో తమ పిల్లలను ఇక్కడ చేర్పవచ్చని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎన్ఐటీ ఆచార్యులు శైలజ కుమారి మాట్లాడుతూ, పోల్చుకోవడం మంచి లక్షణం కాదని, విద్యార్థులకు మార్కులు లేదా మాధ్యమం ముఖ్యం కాదని అన్నారు. విద్యార్థిలో పరివర్తన రావాలని, క్రమశిక్షణ, కష్టపడే తత్వం, నిజాయితీ విజయానికి మూల సూత్రాలని ఆమె వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. భిక్షాలు మాట్లాడుతూ తమ కళాశాలకు మంచి ప్లేస్‌మెంట్ రికార్డు ఉందని, విద్యతో పాటు విద్యేతర అంశాలపై కూడా శ్రద్ధ వహిస్తామని తెలిపారు. విద్యార్థులందరినీ తమ పిల్లలుగా భావిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ వీణ పాల్గొన్నారు.

# విషజ్వరంతో మహిళ మృతి



**వరంగల్ వాయిస్, నడికూడ:** మండలంలోని ముస్త్యాలపల్లి గ్రామంలో విషజ్వరంతో బాధపడుతూ బందెల కాంతలక్ష్మి (55) అనే మహిళ గురువారం మృతి చెందారు. ఆమె కుమారుడు బందెల శివకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం, సోమవారం ఆమెకు జ్వరం వచ్చింది. స్థానికంగా చికిత్స చేయించినప్పటికీ జ్వరం తగ్గకపోగా, ప్లేట్‌లెట్స్ కౌంట్ గణనీయంగా పడిపోయింది. దీంతో ఆమెను హనుమకొండలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఆమె మరణించారు. మృతురాలు నిరుపేద కుటుంబానికి చెందినవారు. ఆమె భర్త కొన్ని సంవత్సరాల క్రితం మరణించగా, ఇప్పుడు ఆమె కూడా మృతి చెందడంతో కుమారుడు శివకృష్ణ ఒంటరివాడయ్యాడు. దీంతో వారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# శాయంపేటలో వినాయక చవితి వేడుకలు



**వరంగల్ వాయిస్, శాయంపేట:** బుధవారం వినాయక చవితి పండుగను శాయంపేట మండలంలోని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వినాయకుడికి ఇష్టమైన ఈ రోజున, మండలంలోని అన్ని గ్రామాలలో కుల సంఘాలు, పరపతి సంఘాలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో వాడవాడలా గణనాథుని విగ్రహాలను ప్రతిష్టించారు. వినాయకుడి విగ్రహాలను డప్పుల, బాజా భజంత్రీల, మరియు నృత్యాలతో కూడిన ఊరేగింపుగా తీసుకొచ్చి మండపాల్లో ప్రతిష్టించారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భాద్రపద శుద్ధ చవితి నుంచి ప్రారంభమైన ఈ నవరాత్రులు తొమ్మిది రోజుల పాటు కొనసాగుతాయి. ఈ తొమ్మిది రోజుల్లో గణపయ్యకు భజనలు, అన్నదానాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ పండుగతో శాయంపేట మండలం అంతా గణపతి నామస్మరణతో మారుమోగింది.

# గణేశ్ మండపాన్ని సందర్శించిన డీసీపీ



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి:** రఘునాథపల్లి మండల కేంద్రంలోని కురుమవాడ శ్రీ విఘ్నేశ్వర యూత్ గణేశ్ మండపాన్ని జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ పర్యటనలో డీసీపీ వెంట సీఐ ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎస్సై దూదిమెట్ల నరేష్ యాదవ్, యూత్ సభ్యులు పేర్ని కార్తీక్, పేర్ని అనిల్, సిహెచ్ రాజు, గుండా సునీల్, పిల్లిమెల్లి అవినాష్, సిహెచ్ అరవింద్, ఇతర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్శనతో స్థానిక యువతలో మరింత ఉత్సాహం నిండింది.

# డీజేల మోత బంద్

## దామెర ఎస్సై కొంక అశోక్



**వరంగల్ వాయిస్, దామెర :** వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మండపాల వద్ద కానీ, నిమజ్జనం ఊరేగింపులలో కానీ డీజేలను పెట్టరాదని దామెర ఎస్సై కొంక అశోక్ స్పష్టం చేశారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలోని 14 మంది డీజే నిర్వాహకులకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గణేష్ మండపాల వద్ద డీజేలు పెట్టడం వల్ల భక్తులకు, ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయని తెలిపారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘించి డీజేలను నిర్వహిస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల శాంతి భద్రతలను కాపాడటం తమ ప్రధాన కర్తవ్యమని ఆయన పేర్కొన్నారు.

# ఊరూరా కొలువుదీరిన గణనాథులు



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆత్మకూరు మండలంలోని అన్ని గ్రామాల్లో వాడవాడలా గణనాథులు కొలువుదీరారు. భాద్రపద శుద్ధ చవితి రోజున ప్రారంభమైన గణపతి నవరాత్రి ఉత్సవాలు తొమ్మిది రోజుల పాటు ఘనంగా జరగనున్నాయి. పదవ రోజున గణనాథులను నిమజ్జనం చేయనున్నారు. భక్తులు భక్తిశ్రద్ధలతో, బ్యాండ్ మేళాలు, బాజా భజంత్రీలతో భారీ ఊరేగింపులు నిర్వహించి గణపతులను మండపాలకు తరలించారు. అక్కడ ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించారు. దీంతో గ్రామమంతా "గణపయ్య నామస్మరణ"తో మారుమోగిపోయింది. ఈ ఉత్సవాలను పురస్కరించుకొని గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# కరెంట్ షాక్‌తో ఆరు గేదెలు మృతి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రెడ్డిపురం శివారులో ఉన్న బొందల చెరువు వద్ద బుధవారం జరిగిన దుర్ఘటనలో ఆరు పాడి గేదెలు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాయి. ఈ గేదెలు యాదవ నగర్‌కు చెందిన రైతులు వంగ రాంచందర్, గంగినేని సతీష్, సకినాల సారంగంలకు చెందినవి. పోలీసుల వివరాల ప్రకారం చెరువు పక్కన ఉన్న రైతులు తమ పొలాలకు నీటిని పారించేందుకు ఏర్పాటు చేసిన మోటార్ల కరెంటు వైర్లు తగిలి ఈ ఘటన జరిగిందని తెలిపారు. ఈ దుర్ఘటనపై గేదెల యజమానులు కేయూసీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గేదెలను కోల్పోయిన రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమ జీవనోపాధి పూర్తిగా పాడి గేదెలపైనే ఆధారపడి ఉందని, ఈ ఘటనతో తాము తీవ్ర ఆర్థిక నష్టానికి గురయ్యామని తెలిపారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని, నష్టపరిహారం అందించి సహాయం చేయాలని వారు కోరారు.

# అజయ్ ని అభినందించిన ఎర్రబెల్లి



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ చినపెల్లి అజయ్‌ను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అభినందించారు. ఇటీవల పర్వతగిరిలో యూరియా కోసం రైతులు పడుతున్న ఇబ్బందులను అజయ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ పోస్ట్‌ను చూసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన సోషల్ మీడియాలో రీ-పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ ప్రజలకు రైతులకు న్యాయం చేయాలనే లక్ష్యంతో అజయ్ చేసిన సోషల్ మీడియా పోరాటాన్ని అభినందించారు. సోషల్ మీడియాను ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడానికి ఉపయోగించడం మంచి పరిణామం అని ఆయన పేర్కొన్నారు.

# పూజారి సాంబయ్యకు ఎమ్మెల్యే రేవూరి నివాళి



**వరంగల్ వాయిస్, పరకాల:** పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ స్వర్గీయ పూజారి సాంబయ్య మృతి పట్ల పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. గురువారం అనారోగ్యంతో మరణించిన సాంబయ్య పార్థివ దేహాన్ని సందర్శించి, పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రాజకీయ జీవితంలో సాంబయ్య నిజాయితీ, క్రమశిక్షణ, నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనమని ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి కొనియాడారు. ఆయన మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు.

## వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని పసరగొండ గ్రామంలోని వరి పొలాలను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రైతులు శనిగీరం సుధాకర్, సంతోష్, కుమారస్వామి, సాంబయ్యతో పాటు వ్యవసాయ అధికారి రాకేష్, ఏఈఓ రామకృష్ణ పాల్గొన్నారు. ప్రస్తుతం వరి పంటలో సుడిదోమ, మొగిపురుగు ఉధృతిని గమనించిన అధికారులు, వాటి నివారణకు రైతులకు సలహాలు ఇచ్చారు. మొగిపురుగు నివారణకు ఎకరానికి 8 కిలోల కార్బో ఫురాన్ 3జీ గుళికలను 20 కిలోల ఇసుకలో కలిపి చల్లాలి. లేదా, కార్తాఫ్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రాములు ఒక ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. సుడిదోమ నివారణకు ఎకరానికి 250 గ్రాముల ఏసీపేట్ 75% డబ్ల్యూపీని పిచికారీ చేయాలి. లేదా, ఇమిడాక్లోప్రైడ్ 100 ఎంఎల్ మరియు వేపనూనె 500 ఎంఎల్ ఒక ఎకరానికి కలిపి పిచికారీ చేయాలని అధికారులు సూచించారు.

## దళిత బంధు రాష్ట్ర కార్యదర్శిగా జన్ను సుమన్



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** దళిత బందు రాష్ట్ర అధ్యక్షుడు కొగిల మహేశ్ ఆధ్వర్యంలో హనుమకొండలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని నియమించారు. ఈ సమావేశంలో దళిత బందు రాష్ట్ర కార్యదర్శిగా జన్ను సుమన్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా జన్ను సుమన్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు కొగిల మహేశ్‌తో పాటు కార్యవర్గ సభ్యులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. దళితుల అభ్యున్నతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

## ఘనంగా గణేశ్ ఉత్సవాలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** హనుమకొండలోని సాయిబాబా మందిరంలో వినాయక చవితి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో మందిరంలో మట్టి గణపతిని ప్రతిష్టించారు. గురువారం నిర్వహించిన ఆరాధన కార్యక్రమాలలో మందిర చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్, ధర్మకర్త నిమ్మల శ్రీనివాస్, వాగ్దేవి విద్యా సంస్థల అధినేత చందుపట్ల దేవేందర్ రెడ్డి, వాహిని, వెంకన్న కళ్యాణి దంపతులు తదితరులు పాల్గొన్నారు. మందిర పూజారులు కిషోర్ శర్మ, మణిశర్మ, చందు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం జరిగిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రసాదం స్వీకరించారు.

## ఓటర్ల జాబితా విడుదల



**వరంగల్ వాయిస్, దామెర:** స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం దామెర మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ముసాయిదా ఓటర్ల జాబితాను నోటీసు బోర్డులపై ప్రదర్శించారు. ఓటర్ల జాబితాలో ఏవైనా మార్పులు, చేర్పులు లేదా అభ్యంతరాలు ఉంటే తెలియజేయవచ్చని అధికారులు కోరారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల ఓటర్ల జాబితాతో పాటు పోలింగ్ కేంద్రాల సంఖ్య, వాటి వివరాలను కూడా ప్రదర్శించారు. ఈ ఓటర్ల జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే, రాజకీయ పార్టీల అధ్యక్షులు, కార్యదర్శులు ఈ నెల 30న మధ్యాహ్నం మండల అభివృద్ధి కార్యాలయంలో జరిగే సమావేశంలో తమ అభ్యంతరాలను తెలియజేయవచ్చని ఎంపీడీఓ గుమ్మడి కల్పన తెలిపారు. ఎంపీఓ రంగాచారి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యుత్ అమరుల ప్రాణ త్యాగ ఫలితం ఉచిత కరెంట్

### ◆ సీపీఎం నాయకులు గంగాపురం మహేందర్



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి:** మనం నేడు అనుభవిస్తున్న ఉచిత కరెంటు 2000వ సంవత్సరం ఆగస్టు 28న విద్యుత్ పోరాటంలో అమరులైన వారి ప్రాణ త్యాగాల ఫలితమేనని సీపీఎం మండల కార్యదర్శి గంగాపురం మహేందర్ అన్నారు. గురువారం రఘునాథపల్లిలోని సీపీఎం కార్యాలయంలో బాలస్వామి, విష్ణువర్ధన్ రెడ్డి, రామకృష్ణల అమరత్వానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ 2000 సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని తెలుగుదేశం ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు షరతులకు తలొగ్గి విద్యుత్ సంస్కరణలను అమలు చేయాలని చూసిందని, దీనికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఉద్యమాలు జరిగాయని తెలిపారు. విద్యుత్ ప్రైవేటీకరణను ఆపాలని, ప్రజలపై విద్యుత్ భారాన్ని మోపవద్దని డిమాండ్ చేస్తూ 9 వామపక్ష, కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో సుమారు 100 రోజుల పాటు ఉద్యమం సాగిందని చెప్పారు. ప్రతి గడపకు ఈ ఉద్యమం చేరిందని, విద్యుత్ ప్రైవేటీకరణ జరిగితే పేదలకు, రైతులకు తీవ్ర నష్టమని ప్రజలందరూ గ్రహించి ఈ పోరాటంలో భాగస్వాములయ్యారని అన్నారు. ఈ ఉద్యమంలో భాగంగా 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని నిర్వహించగా, వేలాది మంది ప్రజలు పాల్గొన్నారని, ఆ సమయంలో పోలీసులు కాల్పులు జరపగా బషీర్ బాగ్ వద్ద ముగ్గురు అమరులయ్యారని గుర్తు చేసుకున్నారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో ప్రజలు తెలుగుదేశం ప్రభుత్వాన్ని ఓడించారని చెప్పారు. ఆ ముగ్గురు అమరవీరుల బలిదానం ఫలితంగానే ఇప్పటికీ ప్రభుత్వాలు విద్యుత్ ఛార్జీలు పెంచకుండా ప్రజలందరికీ ఉచిత విద్యుత్ అందిస్తున్నాయని మహేందర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేయబోయే సరళీకరణ, ఆర్థిక, మతోన్మాద, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలందరూ పెద్ద ఎత్తున పోరాటాల్లో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాల్లో సమస్యలు పేరుకుపోయాయని, వాటి పరిష్కారం కోసం కూడా ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కడారి ఐలయ్య, పొదల లవ కుమార్, కడారి ఆంజనేయులు, పోషబోయిన అంజయ్య, వెంకటయ్య, మల్లయ్య, రాములు, రవి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు ఏవీవీ విద్యార్థి రామ్‌చరణ్ ఎంపిక



**వరంగల్ వాయిస్, వరంగల్:** వరంగల్ జిల్లాలోని ఏవీవీ పాఠశాలకు చెందిన తేజావత్ రామ్‌చరణ్ 11వ తెలంగాణ స్టేట్ జూనియర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని గురువారం పాఠశాల ఇంఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ అనిత తెలిపారు. ఈ నెల 22న హనుమకొండ జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన వరంగల్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో రామ్‌చరణ్ అద్భుత ప్రతిభ కనబరిచాడు. లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానం, 400 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం, మరియు 200 మీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానం సాధించాడు. ఈ విజయాలతో అతను ఈ నెల 30, 31 తేదీలలో మహబూబ్‌నగర్‌లోని పాలమూరు యూనివర్సిటీలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ఈ సందర్భంగా డాక్టర్ అనిత మాట్లాడుతూ ఆటలు శారీరక, మానసిక వికాసానికి, జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగడానికి ఉపయోగపడతాయని అన్నారు. రామ్‌చరణ్ రాష్ట్రస్థాయిలో కూడా మంచి ప్రతిభ కనబరిచి, జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. రామ్‌చరణ్‌ను పాఠశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ అనితతో పాటు, సంకతాల సంజీవ, గందె శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బరుపాటి గోపి, లైబ్రేరియన్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కొడిమాల శ్రీనివాస రావు, రమ్య కృష్ణ, ఉపాధ్యాయ బృందం సంధ్యా రాణి, నవీన్, డాక్టర్ విజయలక్ష్మి, వసంతరాణి, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు మహేందర్, రాజశేఖర్ అభినందించారు.

## బీసీ రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలు జరిపితే తీవ్ర పరిణామాలు

### తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలు నిర్వహిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు హెచ్చరించారు. సెప్టెంబర్ మొదటి వారంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు, అక్టోబర్ మొదటి వారంలో గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సెప్టెంబర్ 2న ఓటరు జాబితాను ప్రకటించనున్న నేపథ్యంలో బీసీ రిజర్వేషన్ల పై గందరగోళం నెలకొందని వెంకట్రాములు అన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపునకు సంబంధించిన బిల్లు రాష్ట్ర శాసనసభలో ఆమోదం పొంది, కేంద్రానికి పంపించినప్పటికీ, ఆర్డినెన్స్ గవర్నర్‌కు పంపించినప్పటికీ, ఈ రెండూ రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కావాలనే బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటుందని ఆరోపించారు. రాజకీయాలకు అతీతంగా బీసీలు తమ డిమాండ్ల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని వెంకట్రాములు

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో జనగామకి రెండవ స్థానం

### ■ ప్రభుత్వం నుంచి ప్రశంసా పత్రం



**వరంగల్ వాయిస్, జనగామ:** జనగామ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయని, దీనికి ప్రజాప్రతినిధులు, అధికారుల కృషి అభినందనీయమని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. మొదటి విడతలో 71 శాతం, రెండవ విడతలో 86 శాతం గ్రౌండింగ్ పనులు పూర్తి కావడంతో, ఈ నెలలో రాష్ట్ర స్థాయిలో జనగామ జిల్లా రెండవ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి అందుకున్న ప్రశంసా పత్రం, ల్యాప్‌టాప్‌ను కలెక్టర్ గురువారం తన కార్యాలయంలో హౌసింగ్ పీడీ మాత్రు నాయక్‌కు అందజేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆయన కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ మంజూరైన ఇళ్లను త్వరగా పూర్తి చేయడానికి ప్రజాప్రతినిధులు, మండల స్పెషల్ అధికారులు, హౌసింగ్ శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఇంజనీరింగ్ ఎంపీవో, పంచాయతీ అధికారులు ఎంతగానో కృషి చేశారని ప్రశంసించారు. క్షేత్రస్థాయిలో అధికారులు నిర్మాణంలో ఉన్న ఇళ్లను ఎప్పటికప్పుడు సందర్శిస్తూ, లబ్ధిదారులతో నిరంతరం సంప్రదిస్తూ ఇసుక, మొరం వంటి సామాగ్రి సరైన ధరలకు అందేలా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. జిల్లాలో మొత్తం మొదటి విడతలో 716 ఇళ్లు మంజూరు కాగా 479 గ్రౌండింగ్ అయ్యాయని, రెండవ విడతలో 5282 ఇళ్లు మంజూరు కాగా 4341 గ్రౌండింగ్ దశలో ఉన్నాయని కలెక్టర్ వివరించారు. ఇందులో 2693 ఇళ్లు బేస్మెంట్ స్థాయిలో, 432 గోడల దశలో, 187 స్లాబ్ స్థాయిలో ఉన్నాయన్నారు. ఇప్పటివరకు రూ. 34.98 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామని పేర్కొన్నారు. మిగిలిన ఇళ్లను కూడా త్వరగా పూర్తి చేయాలని, అందుకు లబ్ధిదారులు కూడా సహకరించి జిల్లాకు మంచి పేరు తీసుకురావడానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



## మోహన్ లాల్ మూవీ ట్రైలర్ విడుదల

మలయాళ ప్రముఖ నటుడు మోహన్‌లాల్ హీరోగా తెరకెక్కిన తాజా చిత్రం 'హృదయపూర్వం' . మాళవికా మోహనన్, సంగీత్ ప్రతాప్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. సత్యన్ అంతికాడ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్ర బృందం –ట్రైలర్ ను రిలీజ్ చేసింది.



## వేయిమంది డాన్సర్లతో పెద్ది

రామ్‌చరణ్ 'పెద్ది' సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. వినాయక చవితి వేళ కూడా చిత్ర బృందం షూట్‌లో పాల్గొంది. మైసూరులో మొదలైన తాజా షెడ్యూల్‌లో బుధవారం ఓ మాస్ సాంగ్‌ను చిత్రీకరించారు. జానీ మాస్టర్ ఆధ్వర్యంలో రామ్‌చరణ్‌తోపాటు– 1000 మందికిపైగా డ్యాన్సర్లతో సాంగ్ షూట్ చేపట్టారు. సెట్స్ నుంచే చిత్ర బృందం ప్రేక్షకులకు పండగ శుభాకాంక్షలు తెలిపింది. ఈ మేరకు వీడియో విడుదల చేసింది. గ్రామీణ నేపథ్యంతో తెరకెక్కుతున్న స్పోర్ట్స్ డ్రామా మూవీ ఇది. కొన్ని రోజుల క్రితం రామోజీ ఫిల్మ్ సిటీలో కీలక షెడ్యూల్ షూటింగ్ పూర్తిచేసుకున్న సంగతి తెలిసిందే. 'ఉప్పెన' ఫేం బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్. కన్నడ నటుడు శివ రాజ్‌కుమార్, బాలీవుడ్ నటు–డు దివ్యేందు శర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. హీరో–డైరెక్టర్, హీరో– హీరోయిన్ కాంబినేషన్లతోపాటు– ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఓ షాట్ మరిన్ని అంచనాలు పెంచింది. వచ్చే ఏడాది మార్చి 27న సినిమా విడుదల కానుంది.



## కొత్త లోక ట్రైలర్ విడుదల

ప్రేక్షకులను అలరించేందుకు మరో ఫాంటసీ థ్రిల్లర్ రాబోతోంది. కల్యాణి ప్రియదర్శన్ , నస్లేన్ ప్రధాన పాత్రల్లో డామినిక్ అరుణ్ తెరకెక్కించిన చిత్రం 'కొత్త లోక' తొలిభాగం 'కొత్త లోక: చంద్ర' పేరుతో ఈ నెల 29న బాక్సాఫీసు ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఇప్పటికే మలయాళం ట్రైలర్ రిలీజ్ చేసిన చిత్ర బృందం తెలుగు ట్రైలర్ ను మంగళవారం విడుదల చేసింది. ఇందులో సూపర్ పవర్స్ ఉన్న లోకగా కల్యాణి కనిపించారు. వేరే ఊరికి వెళ్లిన లోక.. ఎందుకు తన పద్ధతి మార్చుకోవాల్సి వచ్చింది? ఆమెకు ఎదురైన సవాళ్లేంటి? తదితర అంశాలతో సినిమాని తెరకెక్కించనట్టు– –ట్రైలర్ చూస్తూ అర్థమవుతోంది.



## మిరాయ్ ట్రైలర్ విడుదల

యువ నటుడు తేజ సజ్జా ప్రధానపాత్రలో రూపొందుతోన్న చిత్రం 'మిరాయ్'. మంచు మనోజ్ ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వంలో పాన్ ఇండియా స్థాయిలో ఇది రానుంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. 2 నిమిషాల 58 సెకన్లు ఉన్న ఈ వీడియోలో సినిమాలో వీఎఫ్ఎక్స్ ఎఫెక్ట్‌లు ఏ స్థాయిలో ఉండనున్నాయో చూపారు. డ్రాగన్‌తో హీరో పోరాటం, 'దునియాలో ఏదీ నీది కాదు..' అంటూ వచ్చే డైలాగులు ఆకట్టుకుంటున్నాయి. సెప్టెంబర్ 12న ఈ సినిమా విడుదల కానుంది. టాలీవుడ్ ప్రేక్షకులు ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నా చిత్రాలో 'మిరాయ్' ఇకటి. తేజ సజ్జా హీరోగా, కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైప ప్రతి ఒక్క అప్‌డేట్ లో యాక్షన్ సన్నివేశాలను మరొక స్థాయికి తీసుకెళ్లగా.. తాజాగా ఈ సినిమా –ట్రైలర్ విడుదల చేశారు. కాగా ఈ –ట్రైలర్ మంచి ప్రామిసింగ్‌గా ఉందని చెప్పాలి. ముఖ్యమైన ఓ 9 శక్తివంతమైన గ్రంథాలు.. వాటి కోసం వెతికే విలన్, వాటిని అతనికి చిక్కకుండా చేసేందుకు పోరాటం చేసే హీరో ఈ మధ్యలో సాలిడ్ యాక్షన్, అడ్వెంచర్ ఎలిమెంట్స్ ఊహించని లెవెల్లో ఉన్నాయి. మొత్తనికి సెపరేట్ ప్రపంచాన్ని చూపిస్తూ మేకర్స్ ఇంప్రెస్ చేశారు. కాగా ఈ కార్యక్రమంలో తేజ సజ్జా మాట్లాడుతూ.. 'నేను పాన్ ఇండియా హీరో కావాలనుకోవడం లేదు. ఎందుకంటే మన తెలుగు ప్రేక్షకుల కోసం మాత్రమే నటిస్తున్నాను. మీ అందరి మెప్పు కోసం వర్క్ చేస్తున్నాను. నా సినిమా మిగతా వారికి నచ్చితే అది బోనస్ మాత్రమే. నేను ఎల్లప్పుడూ మీ దగ్గరే ఉంటాను, మీ కోసం ప్రెస్ మీట్స్ నిర్వహిస్తాను. ఈ సినిమాలో మంచు మనోజ్ కనిపించిన ప్రతిసారీ ఆడియన్స్‌కు గూస్ బంప్స్ వస్తాయి' అని తెలిపారు. అలా తేజ తన అభిమానుల పట్ల ఉన్న ప్రత్యేక అభిమానాన్ని, వారి కోసం చేస్తున్న కృషిని స్పష్టంగా వ్యక్తం చేశారు. ఆయన చెప్పినట్లు–, ఈ సినిమా పూర్తిగా తెలుగు ప్రేక్షకుల కోసం కట్టు–బడి రూపొందించబడిరది. ఈ ప్రాజెక్ట్‌లోని ప్రతి సన్నివేశం ప్రేక్షకులకు కొత్త అనుభవాన్ని ఇవ్వనుందని అర్థం అవుతుంది.






# అభివృద్ధి చేయడం చేతకాక.. కేంద్ర మంత్రిపై నిందలు

- అవగాహన లేక 'నాయిని' వ్యక్తిగత విమర్శలు
- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం చేతకాక కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌పై వ్యక్తిగత దూషనలు చేయడం ఆయన అవివేకానికి నిదర్శనమని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ విమర్శించారు. గురువారం వరంగల్ చౌరస్తాలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇద్దరు మంత్రులు, 10 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉండి ఏం లాభమని ప్రశ్నించారు. ఉమ్మడి వరంగల్‌లో ఒక్క అభివృద్ధి పని కూడా చేపట్టలేదని విమర్శించారు. వరంగల్ నగరాభివృద్ధికి కేంద్రం స్మార్ట్ సిటీ కింద కోట్లాధి నిధులు మంజూరు చేస్తుంటే, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి ఒక్కపైసా కూడా తేలేని స్థితిలో ఇక్కడి నాయకులు ఉన్నారంటూ మండిపడ్డారు.

## బీసీలకు 42శాతం ఇస్తే స్వాగతిస్తాం..

బీసీ రిజర్వేషన్‌పై నాయిని రాజేందర్‌రెడ్డికి ఏమైనా అవగాహన ఉందా అంటూ గంట రవికుమార్ ప్రశ్నించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తే స్వాగతిస్తామన్నారు. కాని కాంగ్రెస్ కుట్ర పూరితంగా వ్యవహరిస్తూ 10శాతం ముస్లింలను కలుపుకుని అంతా బీసీ రిజర్వేషనే అంటూ నాయిని మాట్లాడడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు.

## ఎంజీఎం.. బస్టాండ్ కనిపించడం లేదా..

సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నాయిని బండి సంజయ్‌ను వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని గంట రవికుమార్ సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు ప్రధాన కేంద్రంగా ఉన్న పశ్చిమ నియోజకర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న నాయిని రాజేందర్‌రెడ్డి ఇక్కడ జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. కాజీపేట దర్గా, హనుమకొండ జైన్‌మందిర్ గుట్టకు స్మార్ట్ సిటీ కింద నిధులు కేంద్రం ఇచ్చిన విషయం మరిచారా అంటూ ప్రశ్నించారు. ఎంజీఎం ఆస్పత్రి దయనీయంగా మారినా నాయినికి కనిపించడం లేదా అని గంట నిలదీశారు. భవనం పెచ్చులూడుతున్నాయని, కనీసం ఫ్యాన్లు కూడా లేకపోవడంతో పేద రోగుల ఇంటి నుంచి ఫ్యాన్లు తెచ్చుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో మీరే అధికారంలో ఉన్నారు కదా.. వరంగల్ బస్టాండ్ నిర్మాణం కోసం ఎందుకు కృషి చేయడం లేదని ప్రశ్నించారు. ఎంజీఎం, వరంగల్ బస్టాండ్ నిర్మాణంపై బీజేపీ ఆధ్వర్యంలో ధర్నాలు, నిరసనలు చేసినా పట్టించుకోవడం లేదని విమర్శించారు.

## తోకముడిచిన రాహుల్..

బీహార్‌లో ఓట్ల గల్లంతుపై ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ.. గల్లంతైన వారి వివరాలు ఇవ్వాలని ఎలక్షన్ కమిషన్ కోరడంతో తోక ముడిచారని ఎద్దేవా చేశారు. ఓట్ చోర్ అంటూ బీజేపీపై వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. నిజానికి కాంగ్రెస్సే మతతత్వ పార్టీ అని విమర్శించారు. అయోధ్య రామాలయం, మహాకుంభ మేళ జరిగితే అక్కడికి వెళ్తే ఎక్కడ మైనారిటీ ఓట్లు దూరమవుతాయనే భయంతో వెళ్లలేదని ఆరోపించారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, వన్నాల వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరిశంకర్, మల్లాడి తిరుపతిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్ కుమార్, ఎరుకుల రఘునారెడ్డి, జిల్లా కార్యదర్శి గోకే వెంకటేష్, కోశాధికారి కూచన క్రాంతి కుమార్, అధికార ప్రతినిధి ఆడెపు వెంకటేష్, ప్రచార కార్యదర్శి బైరి శ్యాంసుదర్, కార్యాలయ కార్యదర్శి పెద్ది నవీన్ తదితరులు పాల్గొన్నారు.



# నిమజ్జనాన్ని పక్కాగా నిర్వహించాలి

- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్
- గ్రేటర్ కమిషనర్ తో కలిసి క్షేత్ర స్థాయి పరిశీలన

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ నగరం దేశాయిపేటలోని చిన్న వడ్డేపల్లి చెరువును జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, డీసీపీలు రాయల ప్రభాకర్, షేక్ సలీమా, వరంగల్ సబ్ డివిజన్ ఎస్పీ శుభం ప్రకాష్ తో కలిసి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సందర్శించారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా చెరువు వద్ద జరుగుతున్న ఏర్పాట్లను వారు పర్యవేక్షించారు. నిమజ్జనానికి కావలసిన ఏర్పాట్లు, బందోబస్తుపై వారు చర్చించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. నిమజ్జనం సమయంలో రద్దీని నియంత్రించడం, ప్రజల భద్రత వంటి అంశాలపై దృష్టి సారించాలన్నారు. అంతేకాకుండా నగరంలోని గణేష్ మండపాల నిర్వాహకులు, స్థానిక ప్రజలు, కమిటీల సహకారంతో నిమజ్జనం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా చూడాలని కోరారు.

## హనుమకొండలో..

సెప్టెంబర్ 5వ తేదీన ట్రై సిటీ పరిధిలో నిర్వహించే గణేష్ నిమర్జన కార్యక్రమానికి సంబంధించి కాజీపేటలోని బంధం చెరువు, హనుమకొండలోని సిద్దేశ్వర గుండం, హసన్ పర్తి చెరువులను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, అదనపు డీసీపీ ప్రభాకర్ రావు, స్పెషల్ బ్రాంచ్ ట్రాఫిక్ ఏసీపీలు జితేందర్ రెడ్డి, సత్యనారాయణ, ఇన్స్ స్పెక్టర్లు సుధాకర్ రెడ్డి, వెంకన్నతో పాటు స్థానిక పోలీస్ అధికారులు పరిశీంచారు. నిమర్జన కార్యక్రమ నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్లపై క్షేత్ర స్థాయిలో సీపీ సంబంధిత అధికారులతో సమీక్షా చేశారు. ముఖ్యంగా నిమజ్జన జరిగే ప్రాంతంలో ఏర్పాటు చేయాల్సిన క్రేన్లు, సిబ్బంది నియామకం, విద్యుత్ దీపాల ఏర్పాట్లు, బారికేడ్ల నిర్మాణం, తెప్పల ఏర్పాటుపై సీపీ అధికారులతో చర్చించారు.

# విద్యారంగ అభివృద్ధికి చర్యలు

- ఎంపీ కావ్య, ఎమ్మెల్యే నాగరాజు
- మైనారిటీ స్కూల్ లో ఆకస్మిక తనిఖీలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రకటించారు. తెలంగాణలో విద్యారంగ అభివృద్ధికి చర్యలు కొనసాగుతున్న నేపథ్యంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 43వ డివిజన్ జక్కులొద్ది తెలంగాణ రెసిడెన్షియల్ మైనారిటీ పాఠశాలను గురువారం జిల్లా కలెక్టర్ సత్యశారదా దేవితో కలిసి ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులతో సమావేశమై, భోజన విధానాలు, గుణనిల్వలు, విద్యార్థుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. తరువాత వారు విద్యార్థులతో కలిసి భోజనం చేసి, అందుతున్న ఆహార నాణ్యతను స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, అధ్యాపకులు పాల్గొని అధికారులకు పాఠశాలలో అందుతున్న సౌకర్యాల గురించి వివరించారు. ఈ ఆకస్మిక సందర్శన విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపింది. అనంతరం జూనియర్ కళాశాల విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమై, వారికి విద్య పట్ల దృఢమైన ఆసక్తి కలిగి ఉండాలని సూచించారు. క్రీడల పట్ల ఉన్న మక్కువ మంచిదే కానీ, చదువులోనూ ప్రతిభ కనబర్చాలని సూచించారు. పరీక్షల్లో ఫెయిల్ అయినా నిరుత్సాహం చెందకుండా మళ్లీ ప్రయత్నించి విజయం సాధించాలన్నారు. విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు.

## పాఠశాల తనిఖీ..

అనంతరం పాఠశాలను తనిఖీ చేశారు. క్రీడా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి పెట్టారు. పాఠశాలలో క్రీడా వసతులు, క్రీడా సామాగ్రి అందుబాటులో ఉన్నాయా? లేకపోతే తానే సొంత నిధులతో అవసరమైన సామాగ్రిని అందజేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులు క్రీడలతో శారీరకంగా, మానసికంగా ఉత్తమంగా ఎదుగుతారన్నారు. చదువు మాత్రమే కాకుండా క్రీడల్లోను ప్రతిభ కనబర్చేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. హాస్టల్ డార్మెటరీ పైకప్పు నుంచి నీరు కారడాన్ని గ్రహించిన ఎంపీ, ఎమ్మెల్యే తక్షణమే మరమ్మతు పనులు చేపట్టాలన్నారు. విద్యార్థుల భద్రతకి ఇది చాలా కీలకం అన్నారు. అలాగే, విద్యార్థులు పడే ఇబ్బందులపై పూర్తి సమాచారం సేకరించి తగిన చర్యలు చేపట్టాలన్నారు. హాస్టల్ నిర్వహణలో పారదర్శకత, నాణ్యత పెంచాలని సూచించారు. నిరంతరాయంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తాగు నీరు కలుషితం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు.

## దామెర చెరువు సందర్శన..

జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో, దామెర చెరువులో నీటిమట్టం పెరుగుతున్న పరిస్థితిని ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ సత్య శారద దేవి పరిశీలించారు. ఈ సందర్శనలో వారు చెరువు విస్తీర్ణం, నిల్వ సామర్థ్యం, నీటి ప్రవాహం, ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద వివరాలను సమీక్షించారు. ప్రజల ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం లేకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరమైతే తక్షణ సహాయ చర్యలు చేపట్టేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.





EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com